# పునరపి జననం

— డాక్టర్ శాంతికుమార్

మగతగా వుంది. నా శరీరం నా స్వాధీనంలో లేనంత నీరసంగా వుంది. హాస్పిటల్ వాసనకి కడుపులో తిప్పేస్తోంది. ఇక్కడకు రావడం వరకే నాకు గుర్తుంది. వచ్చి ఇప్పటికి ఎన్ని గంటలైందో? ఎన్ని రోజులైందో?

శక్తినంతా కూడదీసుకుని కళ్లు తెరిచాను. ఎదురుగా ..... ఆయన, నాన్న, అత్తగారు, ఇంకా చాలా మంది బంధువులు.

ఎవరి ముఖాల్లోనూ ఆనందం లేదు. ఎందుకు వీళ్ళందరూ సర్వం కోల్పోయినంత దిగులుగా వున్నారు? నన్ను కబళిస్తుందనుకున్న మృత్యువు ... ఈ భూమి మీద తొలి శ్వాసయినా తీసుకోకముందే ... ఈ లోకాన్ని ఓ క్షణం పాటైనా చూడకముందే... నా బిడ్డని...

''అసలేం జరిగింది? ఎవ్వరూ పెదవి విప్పరేం? ఏమండీ! మీరైనా చెప్పండి! నాన్నా! నువ్వయినా చెప్పు!'' చేతులు జోడించాను.

''ఏం లేదు. నువ్వు విశ్రాంతిగా వుండాలి'' ఆయన కంఠం రుద్ధమైంది.

''మీరంతా నాకు తెలియకుండా ఏదో దాస్తున్నారు. చెప్పండి. అదెంత భయంకరమైన వార్తైనా ఇప్పటికి నేను విన్నవాటిని, చూసిన వాటిని మించిందై వుంటుందా? అయినా ఫరవాలేదు. చెప్పండి. నేను తట్టుకోగలను'' ప్రాధేయపడుతున్నాను.

నిజం! నాకా శక్తి వుంది! నా గతమే అందుకు సజీవ సాక్ష్యం!

** *** ** **

మర్రిచెట్టు జడలు విరబోసుకున్న దయ్యంలా ... ఆ ప్రదేశానికి ప్రకృతి నిలిపిన కాపలాదారులా గంభీరంగా నిల్చొని వుంది. ఆ వూరికన్నా ఆ చెట్టు వయస్సే ఎక్కువని వూరి వాళ్ళనుకునే మాట నిజమేనన్నంత విశాలంగా విస్తరించి వుందా మర్రిచెట్టు. ఆ చెట్టుని రాత్రివేళ చూడటం అదే మొదటిసారి. అసలు పగలు చూడాలంటేనే భయంతో కళ్లు మూసుకునేదాన్ని. దానికి అరఫర్లాంగు దూరంలోనే మెయిన్‌రోడ్డుంది. బస్సులోంచి చూస్తే నడిఎండ సమయంలో కూడా ఆ చెట్టు క్రింద మాత్రం కారు చీకట్లు క్రమ్మినట్లుండి భయాన్ని రెట్టింపు చేస్తుంది.

ఈ రాత్రి వేళ....

కన్ను పొడుచుకున్నా కానరాని చీకట్లో .... అక్కడక్కడా ఎగురుతున్న మిణుగుర్లు గాలిలో నిప్పురవ్వల్లా మెరుస్తున్నాయి!

నేనిక్కడెందుకున్నాను?

చుట్టూ భయంకరమైన చీకటి. 'ఈత' రాని వాడు నడిసముద్రంలో రాత్రివేళ పడిపోయినంత భయం.

ఇక్కడికి ఒంటరిగా నేనెందుకొచ్చాను? నాన్న ఏరీ? గడపదాటబోతూండగానే లక్ష జాగ్రత్తలు చెప్పే నాన్న... నన్నొంటరిగా ఇంత దూరం రానిచ్చారేం!?

అసలేమిటీ స్మశాన నిశ్శబ్దం? దూరంగా వింత నిప్పుల్లా మెరుస్తూన్న అవేమిటి? ఎందుకవి తదేకంగా నా వైపే చూస్తున్నాయి?

''ఊవ్!'' ఆకాశం వైపు తిరిగి అరిచాయవి ... అవి.. అవి.. నక్కలు!

నేను స్మశానం మధ్యలోకి ఎందుకొచ్చాను? ఎవరైనా ఎందుకొస్తారు?

అంటే ... నేను

.. చనిపోయానా?


అవును! చనిపోకపోతే ఇక్కడెందుకుంటాను?

నిలువు లోతు గుంటలో నన్ను నిర్దయగా పడేస్తే ఊపిరాడకుండా ఉక్కిరి బిక్కిరై .... ఆ చితిపై పరుండబెట్టి నిప్పంటిస్తే .... అబ్బా! ఎలా ఆ బాధని భరించడం ....? దహన ఖనన బాధల్ని గురించి నేనాలోచిస్తుండగా ... భుజంపై చల్లని స్పర్శ ... ఆప్యాయత కురిపిస్తూ! ఎవరు?

ఇంకెవరు? అమ్మ!

నా గుండెల్లో పిడుగుపడిన చప్పుడు .... లబ్ డబ్ మంటూ ... నిముషానికి వందసార్లు! విడిపించుకుని పరిగెత్తాలని పెనుగులాడసాగాను.

''ఎందుకు దీప్తీ భయపడతావు? నేను నీకన్న తల్లిని రా!'' అమ్మ కళ్లల్లో మేఘాలు. నేను తనని తిరస్కరించానని బాధ కాబోలు!



అసలు అమ్మని నేనెందుకు తిరస్కరించాలి?

నవమాసాలు మోసి, కని, పెంచిన అమ్మ!... నన్నింతదాన్ని చేసిన అమ్మ. నా అచ్చట ముచ్చట చూడాలని తపనపడిన అమ్మ! నా జీవితానికి చెందిన ప్రతి ఆనందాన్నీ తన కళ్లలో నింపుకోవాలని ఆశించి, నిరంతరం మృత్యువుతో పోరాడుతూ, అలసిసొలసి కాలంలో కలిసిపోయిన అమ్మ!... అలాంటి అమ్మని నేను తిరస్కరిం చవచ్చా?

''తప్పు కదూ'' మందలించింది అంతరాత్మ.

అవును తప్పే! కానీ ... అమ్మ ఇప్పుడు లేదు. నాన్ననీ తమ్ముడ్నీ నన్నూ ఒకరికొకరు తోడుగా బ్రతకమని మళ్లీ తిరిగిరాని లోకాలకు తరలిపోయింది ఒంటరిగా! ఆ మరలిరాని పయనానికి అమ్మని ఇక్కడే వదిలిపెట్టారు! ఇప్పుడు నన్ను ....

ఎవరో నన్నో లోతైన గుంటలోకి బలవంతంగా తోసేస్తున్నారు. ఎవరూ? అమ్మేనా? ''నో!'' పెద్దగా అరుస్తూ ప్రతిఘటిస్తున్నాను. ''అమ్మా! నన్ను తోసెయ్యకు. ఈ ప్రపంచాన్ని వదిలిపెట్టి రావటం ఎప్పటికీ నాకిష్టం లేదు.''

''పిచ్చి తల్లీ! ఏ తల్లీ తన కన్న బిడ్డల్ని చంపుకోదమ్మా! మీరంటే నాకెంత ప్రేమో! అందుకే నా ఆయువు కూడా మీ యిద్దరికీ పంచి, నేను ఆకాశంలో వుండి, మీ సంతోషాన్ని చూస్తూ ఆనందిస్తున్నాను. నువ్వు చినుకుల్లో చిరుజల్లుల్లో తడవటం లేదూ? అవేమిటనుకున్నావ్. నా ఆనందబాష్పాలు తల్లీ! రామ్మా!



రా! ఒక్కసారి ఈ అమ్మకి నీ స్పర్శానుభూతిని కలిగించు తల్లీ!'' చేతులు చాచి పిలుస్తోంది అమ్మ.

అమ్మ దగ్గరకు వెళ్లాలనీ .... ఆ చల్లని ఒడిలో మృత్యువు కందని భద్రతతో హాయిగా నిద్రపోవాలనీ శరీరం తహతహలాడుతోంది. కానీ మనస్సే సహకరించడం లేదు. మరణించిన అమ్మని మనస్సు విశ్వసించనంటోంది.

''రామ్మా'' అమ్మ నా వైపే కదులుతోంది.

పారిపొమ్మనే మనస్సు ... జడత్వంలో శరీరం!

అమ్మ కోసం కళ్లేమో కుంభవృష్టి కురుస్తున్నాయి.

విలవిలలాడుతూ 'కెవ్వ్'మన్నాను.

''దీప్తీ! దీప్తీ!'' కంగారుపడుతున్నారు నాన్న. మంచినీళ్ల గ్లాసందిస్తూ – ''ఏమ్మా! పీడకలేమైనా వచ్చిందా?'' వీపుపై ఆప్యాయంగా నిమురుతూ అడిగారు నాన్న.

నిస్పందేహంగా కలగన్నాను. ఆ కలలో నేను చచ్చిపోయాను. అమ్మని చూశాను. అమ్మ నన్ను తన గుండెల్లో పొదువుకుని అయిదేళ్ల వాడు తనకి దూరమైన మాతృత్వానుభూతిని ఓ క్షణం అనుభవించాలనుకుంది. అమ్మ స్పర్శ కలలో అయినా నాకానందం కాదూ! పాడు మనస్సు ... భయపెట్టింది. ఆ దృశ్యమంతా మెలకువలో కూడా సజీవంగా కన్పిస్తోంది.

నాదింత కఠిన హృదయమా?

అమ్మ ప్రేమని తిరస్కరించిన పాషాణమా?

కానే కాదు. అమ్మంటే నాకెందుకు భయం?

''దీప్తీ! దీప్తీ!'' మళ్లీ పిలిచారు నాన్న.

''ఏం చెప్పాలి?'' నాకొచ్చింది పీడకలేనా? అమ్మ కనిపించిన కల పీడకలెలా అవుతుంది?

''ఏం లేదు నాన్నా! ఏదో కల... భయపడ్డానంతే!''

''రా! ఇలా నా దగ్గరగా పడుకో. నిర్భయంగా నిద్రపో. రేపుదయాన్నే కాలేజీకి వెళ్లొద్దూ?!'' నాన్న నా మీద చెయ్యి వేసి పడుకున్నారు. అయిదు నిమిషాల్లో నిద్రపోయారు.

నాకు నిద్ర రావటం లేదు. కళ్లు మూసుకుని ప్రయత్నిస్తే వచ్చేదేమో గానీ... నేను చనిపోయిన కల మళ్లీ వస్తే ...?

రానీ! అమ్మ మళ్లీ కనిపిస్తుంది. ఈసారి అమ్మని చూసి భయపడను. అమ్మతో ముందు నేనే మాట్లాడుతాను. అమ్మ గుండెల్లో గువ్వలా ఒదిగిపోయి అయిదేళ్లుగా పోగొట్టుకున్న ప్రేమని వాలో నింపుకుంటాను.

అమ్మలేని ఈ సంవత్సరాలు ఎంత శూన్యంగా .... ఎంత చైతన్యరహితంగా ... ఎంత ఒంటరితనంతో ...... ఎంత నిర్జీవంగా గడిచాయి!

అవి నేను తొమ్మిదో తరగతి చదువుకుంటున్న రోజులు. అమ్మకి ఆరోగ్యం బాగాలేకపోతే ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయిదు రోజులు ఎన్నో పరీక్షలు చేసి 'కాన్సర్' అన్నారు డాక్టర్లు. ఆరు నెలలు అలాగే మంచంలోనే వుంది అమ్మ. తిరగని హాస్పిటల్ లేదు, చూడని స్పెషలిస్టు లేదు. చెయ్యని వైద్యం లేదు. చివరకు విసిగిపోయిందిపోయింది కాబోలు ... అమ్మ అంది – ''ఏమండీ! నేను అలిసిపోయాను. ఈ ప్రయాణాలిక చెయ్యలేను! నన్ను ఒంటరిగా ఈ బాధ భరిస్తూ నా పిల్లలతో వుండనివ్వండి చాలు! ఈ ఆఖరి ప్రయాణంలోనైనా నన్ను మీ సన్నిధిలో గడపనివ్వండి ప్లీజ్!''

అప్పుడు అమ్మ కళ్లలో కనిపించిన బ్రతకాలన్న ఆర్తినీ, ఆశనీ చూస్తుంటే 'అమ్మలా' అమ్మని ఓదార్చాలనిపించింది. మంచంపై కూర్చొని, అమ్మ తలని నా ఒళ్లోకి తీసుకుని చెంపలపై జారిన కన్నీటిని తుడిచి, తల నిమురుతూ, ''అమ్మా! నీకు తగ్గిపోతుంది. మళ్లీ నువ్వు అందరి అమ్మల్లా ఆనందంగా వుంటావు!'' అన్నాను ధైర్యం చెప్తూ.

ఆ మాట వింటూనే అమ్మ కళ్లలో మెరుపు .... కొడిగట్టిన వత్తి నెగదోసి ప్రమిదలో మరి కాస్త నూనె పోసినప్పటిలా ! నాన్న కళ్లలో వెలుగు ... ఆకాశం మెరిసినట్లూ, వెన్నెల కురిసినట్లూ!

''తథాస్తు దేవతలీ మాట వింటే ఎంత బావుణ్ణు!'' అన్నారు నాన్న. తన ఆశకు అవధి అంతకు మించినదేదీ లేదన్నట్లు!

అమ్మ ఆరోగ్యం క్షీణించడంతో నాన్నలో విచక్షణ, అంతకుముందున్న హేతుదృష్టీ అన్నీ అదృశ్యమయ్యాయి. నాన్నెంత ఆశాజీవిగా మారారో చెప్పలేను.

ఏమీ చెయ్యలేని నిస్సహాయ స్థితిలో కూడా ముఖాన చిర్నవ్వు పులుముకుని, "యు విల్ బి ఆల్ రైట్!'' అనే డాక్టర్లు బయటికి అడుగుపెట్టగానే గంభీరవదనులై వెళ్లటం నేనెన్నోసార్లు చూశాను.

''ఏమిటీ విజ్ఞాన శాస్త్ర దౌర్భాగ్యం? అణువుల్ని విచ్ఛిన్నం చేసే ప్రక్రియ ద్వారా లక్షలాది ప్రాణాల్ని క్షణాల్లో హరించివేసే నేర్పు మనిషి కిచ్చిన సైన్సు ....విచ్చలవిడిగా పెరిగిపోతున్న కాన్సర్ కణాల్ని నిరోధించే శక్తి నెందుకివ్వలేకపోయింది? దశాబ్దాలుగా ప్రశ్నార్థకంగా నిలిచిన కాన్సర్‌తో పాటు ఎన్నెన్నో కొత్త వ్యాధులు పుట్టుకొస్తూ మనిషికి సవాలుగా నిలుస్తున్నా యెందుకు? నిర్మూలించడం అత్యంత వేగంగా నేర్చుకుంటున్న మనిషి నిర్మించడంలో ఎందుకింత వెనుకపడి వున్నాడు?''

ఎవరి ప్రయత్నంలోనూ లోపం లేదు.

అమ్మ ఒంట్లో రక్తమంతా 'పరీక్షలు' హరించాయి. అమ్మ ఒంట్లో శక్తినంతా మందులు మింగేశాయి. ఎన్ని అప్పులు చేశారో, ఏం తిప్పలు

## పెయిన్ ఎటర్నల్

ఇంతటి మహావృక్షాన్ని వేలాడే
ఈ పక్షి ఎప్పుడూ ఒంటరిదే!
ఏ వసంతానికో రెక్కలల్లార్చి
ఆ లిప్త కాలం తర్వాత
నిరంతరం దిగులు కూతలు కూసే
ఈ పక్షి ఎప్పుడూ ఒంటరిదే!
అప్పుడప్పుడూ వీచే
వడగాడ్పులూ, పెను తుపానులూ
వృక్షాన్ని వణికించి
పక్షిని భయపెడుతూనే వుంటాయి
ఇంత భయంలోనూ
ఇది చెట్టుని వేలాడుతూనే వుంటుంది
సమస్త ప్రపంచమూ
చీకటిలో నిద్రాణమై వున్నప్పుడు కూడా
హృదయపు దీపాన్ని పెట్టుకొని
ఒంటరిగా ప్రపంచాన్ని పరికిస్తూనే వుంటుంది
ఎలియనేషన్‌లో వున్న
ఎటర్నల్ పెయిన్ని మూలుగుతూనే వుంటుంది

— తిరుపతిరావ్

## అటూ 'చీ'

సురేష్: ఈ రోజు పరీక్షలో కాపీ కొట్టడానికి స్లైప్ దొరకలేదు.

వేణు: మరెలా మానేజ్ చేశావ్?

సురేష్: ఏమి చేయలేదు. టెక్స్టు బుక్కులోని పేజీలు చింపి ఆన్సర్ షీటుకు అంటించి వచ్చాను.

–రామం వీణం,
బెంగుళూరు.

పడ్డారో గానీ .... నాన్న డబ్బు ఖర్చు పెట్టటంలో ఏ మాత్రం వెనుకాడలేదు.

అయినా ... అమ్మ మాత్రం...

ఆ దృశ్యం నా హృదయం నించీ ఎప్పటికీ చెరగనంత గాఢంగా ముద్రితమైంది. ఆ రోజు అమ్మకి హఠాత్తుగా కడుపునొప్పి తీవ్రమైంది. బాధతో మెలికలు తిరిగిపోతూ విలవిల్లాడుతోంది. పంటి బిగువున బాధను భరించే ప్రయత్నం చేస్తూనే నిస్సహాయంగా చూస్తోంది. అదృష్టవశాత్తూ ఆ సమయంలో ఇంట్లోనే వున్న నాన్న హడావుడిగా డాక్టరు కోసం పరిగెత్తారు.

బాధలు, భయాలు, రోగాలు, మరణాలు ... ఇవేవీ తెలియని వయసులో వున్న తమ్ముడు పక్కింటి పిల్లలతో ఆడుకుంటున్నాడు. క్షణమొక యుగంగా గడుస్తోంది. నాన్నింకా రాలేదు. డాక్టరున్నారో? లేదో? మంచం ప్రక్కనే కుర్చీలో కూర్చున్న నన్ను తల దగ్గర కూర్చోమని చేత్తోనే చెప్పింది అమ్మ.

కూర్చుంటూండగా "నానీ" అంది. పిలిచాను.

వాడి చేతిని నా చేతిలో వుంచుతూ, "దీప్తీ! నేను వెళ్లిపోతున్నానమ్మా. నాన్నకీ తమ్ముడికీ నువ్వే అమ్మవై..." పట్టి పట్టి పలుకుతున్న మాటలు ఆగిపోయాయి. కళ్లు తదేకంగా నన్నే చూస్తున్నాయి. అమ్మ మనసులోని మాటలన్నిట్నీ ఆ చూపులు నాకు చేరవేస్తున్నాయి.

క్షణాలు గడుస్తున్నాయి. వెళ్లిన ఇరవై నిమిషాల తర్వాత డాక్టర్‌తో వచ్చారు నాన్న. నాడి చూసి పెదవి విరిచారు డాక్టర్.

"లేదంకుల్! అమ్మ చనిపోలేదు!" ఎలుగెత్తి అరవాలని నా గుండె గొంతుకలో కొట్టాడుతోంది. పలుకు పెదవి దాటే లోపలే డాక్టర్ అమ్మ కనురెప్పలు మూశాడు ... అవింకెప్పటికీ తెరుచుకోవు.

ఆరు నెలల .... నూట ఎనభై రోజుల బాధ నుండి అమ్మకి శాశ్వత విముక్తి ప్రసాదించింది సైన్సు కాదు... ఎవ్వరూ ఆహ్వానించడానికిష్టపడని, అందరూ ద్వేషించే మృత్యువు!

పగిలిన తన గుండెని 'పిల్లల బాధ్యత'తో అతికారు కాబోలు .... ఆరు నెలలు గడిచేసరికి నాన్న కోలుకున్నారు.... కనీసం పైకి అలా కనిపించేవారు. నాన్న ఉద్యోగరీత్యా మేం ఊళ్లు తిరుగుతున్నాం ... ట్రాన్స్‌ఫర్ అయినప్పుడల్లా.




కొత్త వాతావరణం, కొత్త స్నేహితులూ, పాఠ్య పుస్తకాలూ, సినిమాలూ అన్నీ కొత్త కొత్తగా ... అన్నీ మారుతూనే వున్నాయి.

మారనిదొకటే... అమ్మ చివరి చూపుల దృశ్యం! పెరుగుతున్న నా వయస్సుకనులోమంగా ఆ చూపుల్లో సజీవత్వమూ పెరుగుతున్నట్లుంది; నవ్యత్వం సంతరించుకున్నట్లుంది. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే ఆ మెరుపు నా కళ్ళ ముందు ఎప్పుడూ సాక్షాత్కరిస్తూనే వుంది... అమ్మ చివరి కోరికను గుర్తుచేస్తూ! అనుక్షణం ఆ చూపులు దేవతలా నన్ను ఆశీర్వదిస్తున్నట్లే వుండేవి!

నేను ఇంటర్ చేరేటప్పుడే నాన్నకీ, నాకూ మధ్య చిన్న అభిప్రాయభేదం. అది అమ్మ ఆశకి చెందినది. అమ్మ ఆశగా నాన్న ఆశయమైంది! నన్ను డాక్టర్నీ, తమ్ముడ్ని ఇంజనీర్నీ చెయ్యాలని అమ్మ మా చిన్ననాటి నుండీ ఆలోచించేదట! నిజానికి నాకూ బయాలజీ అంటే చాలా ఇష్టం. అయినా, ఇంటర్-సైన్స్‌తో చదవడానికి నిరాకరించాను. "అమ్మ కోరిక నెరవేర్చటం ద్వారానే అమ్మ మీద ప్రేమని రుజువు చేసుకోవాలి" అంటూ నాన్న సెంటిమెంటల్‌గా ప్రయత్నించారు.

"నా కిష్టం లేదు నాన్నా?"

"అదే ఎందుకని?"

ఏమని చెప్పను? కప్పల్నీ, బొద్దింకల్నీ, వానపాముల్నీ చంపడం నా కిష్టం లేదని నేను చెప్పే కారణం ఎవరికైనా హాస్యాస్పదంగా తోస్తుందేమోనని నా అనుమానం. నా మనసు పరిధిలో అదెంత బలమైన కారణమో, బరువైన కారణమో అర్థం చేసుకునే దెవ్వరు?... అంకుల్ తప్ప!

అంకుల్‌ని వెంటనే రమ్మని ఉత్తరం వ్రాశాను.

అంకుల్ అంటే నాకు అమ్మంత ప్రేమ. అమ్మతో నాది జన్మతః రక్తానుబంధమైతే అంకుల్‌తో ఉన్నది ఆప్యాయతానుబంధం. అంకుల్‌ని చూడకముందే ఆయనంటే నాకు భక్తి గౌరవాలు ఏర్పడ్డాయి. అంకుల్ కవి, రచయిత. పత్రికల్లో కథల ద్వారా ఆయన పేరు నాకు ముందే తెలుసు. ఆ కథలన్నీ స్త్రీల సమస్యలు ప్రధానంగా చర్చించడం వల్లనేమో మా మనస్సులలో ... చర్చలలో అవి తరచూ ప్రస్తావనకొస్తుండేవి.

అమ్మ చనిపోయాక ఆరు నెలలకి నా పుట్టిన రోజు ఎవరి స్పృహకీ రాకుండానే వెళ్ళిపోయింది. తరువాత సంవత్సరం మాత్రం నాన్న ఎంతో హడావుడి చేశారు.

అమ్మయితే ఉదయం అయిదు గంటలకే నిద్రలేపి తలస్నానం చేయించేది. కొత్త బట్టలు వేసుకున్నాక నాకూడా గుడికి వచ్చేది. నా పేరున అర్చన చేయించి, ప్రసాదం తిన్నాక, స్వయంగా తనే స్వీట్స్ తినిపించేది. మా ఇద్దరి పుట్టిన రోజులూ ఉగాది కంటే ఎక్కువగా జరిపేది.

ప్రస్తుత దేశ పరిస్థితుల్లో దేశ జనాభాని పెంచుకుంటూ పోవడం ఏమంత ఘనకార్యం కాకపోయినా — తన శరీరంలోని ఓ కణం తన ప్రతిబింబంగా రూపొంది తన ఒళ్ళో పెరగడం ప్రతి స్త్రీకీ గర్వకారణమేమో!

"కోటి సంవత్సరాలు వర్ధిల్లు తల్లీ!" పాదాభివందనం చేసిన నన్ను దీవిస్తూ ముఖమంతా ముద్దులు కురిపించేది. పెరుగుతున్న తీగను చూసి ఆనందించే తోటమాలిలా ఆ క్షణంలో కనిపించేది అమ్మ. అలాంటి అమ్మే లేకపోయాక పుట్టిన రోజు పండుగ జరుపుకోవడంలో నాకే అర్థమూ కనిపించలేదు. దానికితోడు... 'ప్రతి పుట్టిన రోజూ చావుకి నిన్నో సంవత్సరం దగ్గర చేస్తుందని గుర్తుంచుకో' అన్న కొటేషన్ ఈ మధ్యే నా కళ్ళబడటం వల్లనేమో... మనస్సంతా ఉదాసీనమైపోయింది. నన్ను 'బర్త్‌డే' మూడ్‌లోకి పంపాలని విశ్వప్రయత్నం చేసిన నాన్న విఫలమై ఆఫీసుకి వెళ్ళారు. గ్రీటింగ్స్ చెప్పటానికొచ్చిన ఇద్దరు ముగ్గురు 'స్నేహితు'లు కూడా నా స్తబ్దత చూసి సెలవుతీసుకున్నారు.

ఫోటో ఆల్బం ముందేసుకుని గతించిన కాలం

లోకి పయనించి జ్ఞాపకాల అలల్లో కొట్టుమిట్టాడుతూండగా "పోస్ట్" కేకతో కవరు విసిరేసి వెళ్ళాడు పోస్టుమేన్.

ఆత్రుతగా కవరందుకున్నాను. బరువుగా వుంది. తెరిచాను.

అందులో స్వయంగా తయారుచేసిన గ్రీటింగ్ కార్డ్... నా పుట్టిన రోజు కోసం!

సజీవంగా కన్పిస్తున్న పూల చిత్రాలు అంటించి... కాప్షన్ పేజీలో కవితాత్మక సందేశం...

"పోయినోళ్ళు అందరూ మంచోళ్ళు
ఉన్నోళ్ళు పోయినోళ్ళ తీపి గురుతులు!"
అన్నారు ఆత్రేయ.

ఒక సంవత్సరపు విజ్ఞానం
ఒక వర్షపు అనుభవాలు
ఓ యేడాది అనుభూతులు
ఆనందాలు...అశ్రువులు కలగలిపి
ఆనందాశ్రువుల మరో పుట్టిన రోజుకి
ఆశా స్వాగతం పలికే ఈ రోజున...
దివి నుండి మీ అమ్మ దీవించునమ్మ"
అన్నట్లు... నేనూ ఇవాళే పుట్టాను తెలుసా! — అంకుల్"

నేనప్పటికి ఒక్కసారైనా చూడని ఈ అంకుల్ ఎవరో 'కవిత'ని చూడగానే అర్థమైంది. నాలో స్తబ్దత మాయమైంది. ఉదాసీనత అదృశ్యమైంది. అంకుల్ ప్రతి అక్షరంలోనూ నాకు అమ్మే ప్రత్యక్షమైంది. నాలో కొత్త ఉత్సాహం చోటుచేసుకుంది. అప్పటి నుంచీ తరచుగా అంకుల్‌నించీ ఉత్తరాలు వస్తూనే వున్నాయి. ఆ ఉత్తరాల్లో ఓ విశేషం కూడా వుంది. తన ఉత్తరాల ద్వారా అంకుల్ నన్ను 'ఎడ్యుకేట్' చేసే ప్రయత్నం చేస్తున్నట్లు నాకు త్వరగానే అర్థమైంది. నేనూ ఓ కొత్త తరహా ఆలోచనాసరళికి అలవాటుపడుతున్నానేమో!

సరిగ్గా ఆ దశలో ... ఒకటి కాదు, రెండు ఘోరమైన సంఘటనలు!

నా స్నేహితురాలు సుందరి... అత్తగారి రూపుదాల్చిన వరకట్న పిశాచికి... వైద్య ప్రయత్నాల అవసరం కూడా లేకుండా వెచ్చగా తుది శ్వాస విడిచింది. ప్రక్క వీధిలోనే వుంటున్న ఆమెను నేనూ చూశాను. ఆమె కళ్ళు... తెల్ల కలువల్లా విప్పారి వున్నాయి. ఆ కళ్ళలో 'నన్ను చంపొద్ద'న్న అభ్యర్థన స్పష్టంగా కనిపిస్తోంది.

"పాపం!" అన్నారు కొందరు.

"పిరికిది!" అన్నారింకొందరు.

"కట్నం ఇచ్చే గతిలేనప్పుడు ... ముందు ఒప్పుకోవట మెందుకు? పండంటి పిల్ల ప్రాణం ఎవరో కాదు... దాన్ని కన్నతండ్రే తీశాడు!" అంటున్నారెవరో!

'లోకులు ఖచ్చితంగా కాకులే' అన్పించింది నాకు. అయితే ఒక్క కాకీ వరకట్నం ఓ దురాచారమని గుర్తించినట్లు లేదు. ఎదురిస్తే కానీ అమ్ముడుపోని పదార్థంగా ముద్రవేయబడి, ఆత్మగౌరవాన్నీ, వ్యక్తిత్వాన్నీ శాశ్వతంగా సమాధి చేసుకుని బానిసగా బతికే దౌర్భాగ్యం పట్ల కనీస స్పృహతో ఒక్క కాకీ గొంతు విప్పలేదు. అంకుల్ ఓసారి అన్నారు, "ప్రపంచ జనాభాలో సగం మంది స్త్రీలున్నారు. ప్రపంచ వార్షిక ఉత్పత్తిలో మూడింట రెండొంతులు స్త్రీ శ్రమ శక్తితోనే తయారవుతున్నాయి" అని.

మరెందుకీ వరకట్న పిశాచం స్త్రీల పాలిట శాశ్వత మృత్యువేదికైంది? సుందరే కాదు... పెద్ద చదువులు చదివి ఉద్యోగాల్లో వున్న స్త్రీలూ, నెలకి వేలకి వేలు సంపాదించే శక్తి వున్న లేడీ డాక్టర్లూ... అందరూ కట్న దేవతని తోడు పెళ్ళికూతురిలా కూర్చో బెట్టుకునే పెళ్ళిళ్ళు చేసుకుంటున్నారు. అర్థ రూపాయ మల్లెపూల ఆర్థిక స్వాతంత్ర్యం కూడా కరువై పట్టుచీరె బానిసల్లా బతుకుతున్నారు! మొత్తానికి అయిదు వేల రూపాయలు సుందరిది ఆత్మహత్యగా నిర్ధారించాయి.

ఇప్పుడు... సుందరి కళ్ళు కూడా నాకు తరచుగా గుర్తువస్తున్నాయి. సుందరి మరణించిన నెలలో మా పక్క ఇంట్లో మరో దుర్మరణం!


'ఆత్మహత్య' అన్నారు అత్త, భర్త. ఆమెని నేను 'అక్కా' అనిపిలిచేదాన్ని. వసంతక్కకి నలుగురు ఆడపిల్లలు. "ఈసారి మగపిల్లాడ్ని కనకపోతే... అదే మనకి ఆఖరి చూపు" అని భర్త హెచ్చరిక చేశాడట. అక్క ఒకటే భయపడుతోంది, మగబిడ్డ పుట్టకపోతే భర్త వదిలేస్తాడేమోనని!

ఆరేళ్ళలో నాలుగు కాన్పులై అయిదోసారికి సిద్ధపడుతున్న అక్క, కళ్ళలో ప్రాణాలు పెట్టుకుని కాలం వెళ్ళబుచ్చుతున్న అక్క... క్షణమొక యుగంగా బతుకుతున్న అక్క... ముందు రోజు సాయంత్రం నాతో తన భయం వ్యక్తం చేసి దిగులుపడుతూ ... తెల్లారేసరికల్లా పొత్తిళ్ళలో వున్న బిడ్డతో సహా శవమైపోయింది!

మగబిడ్డ అన్న మాట కోసం ఆశగా ఎదురు చూస్తూ... ఆడపిల్ల అని తెలియగానే గుండె ఆగి చనిపోయిందో... లేక స్పృహలోకి రాకముందే గొంతు నులిమి చంపేశారోగాని ఆమె కళ్ళా భయం గొల్పేలా తెరుచుకునే వున్నాయి. ఏదేమైతేనేం? వసంతక్కది సహజ మరణం కాదు. మానసికంగా ఆమెలో ఒక అరక్షిత భావాన్ని క్రమక్రమంగా పెంచుతూ... 'నాతి చరామి' అని ప్రమాణం చేసిన భర్త, కన్నకూతుర్లా చూసుకుంటావని అప్పగింతలు పెట్టించుకున్న అత్త కలిపి చేసిన భౌతిక హింసాతీత హత్య. రక్తపాత రహిత హత్య!

అత్తసరే! చదువూ సంధ్యా లేని మండూకం. చదువుకున్న ఆ భర్తకి తెలియదూ! ఆడపిల్ల పుట్టినా, మగ బిడ్డ పుట్టినా అది పురుషుడి పరంగా మాత్రమే జరుగుతుందని!

ఇలాంటి మడిబట్టల హత్యలు ఈ ప్రపంచంలో రోజూ అసంఖ్యాకంగా జరుగుతూనే వున్నాయట. 'అమ్నియోసింటెసిస్' అనే పరీక్ష ద్వారా మూడు నెలలైనా నిండని పిండం ఆడ



పిల్లగా రూపుదిద్దుకుంటోందో, మగపిల్లాడిగా అవతరించనుందో తెలుసుకునే శాస్త్రవిజ్ఞానం మనిషి చేతిలో కొచ్చిందట! ఇంకేం! శిశు హత్యల పాతకం అంటుకోకుండా పిండ హత్యల్ని శాస్త్రీయంగా వైద్యులే చేసేస్తున్నారట! ప్రకృతి సమతుల్యం దెబ్బతింటుందని ఈ మేధావులకు తెలియదూ?! ఓసారి నా సందేహం అంకుల్ నడిగాను.

"జీవకోటిలో ఏ ప్రాణికీ లేనంత నిష్పత్తిలో 'పెద్ద' మెదడూ... దానికి ఆలోచించే శక్తి గల మనిషి కున్న ప్రత్యేక లక్షణం తెలుసా? ద్వంద్వ ప్రవృత్తి. దీనికి పునాది స్వార్థం. కనుకే జాతి అభివృద్ధి జీవకోటికి ప్రకృతి సహజంగా సంక్రమించిన సహజ లక్షణం కాగా, మనిషి మాత్రం విధ్వంసం వైపే శరవేగంతో పరుగులు తీస్తున్నాడు" అన్నారు అంకుల్.

ఆయన చెప్పినదాన్ని పూర్తిగా అర్థం చేసుకునే ప్రయత్నం నేను చేసుండకపోవచ్చు. అందుకు ఇటీవల నా మానసిక పరిస్థితిలో వచ్చిన మార్పే కారణమేమో! ఇప్పుడు అమ్మ కళ్ళు స్మృతి పథంలో కనిపిస్తే గతంలోలా చల్లని చూపుల్లా, ఆశీస్సుల కిరణాల్లా అన్పించడం లేదు. అలవికాని భయం విలువెల్లా ఆవరించేస్తోంది. ఏ పని మీదా ఆసక్తి వుండదు. వేళకింత తినాలన్పించదు. జడత్వం, నిరాసక్తత, అయోమయం... అన్నీ కలగలిసి నన్ను కమ్మేశాయి.

మనిషి పుట్టుకకు అర్థమేమిటి? పెరగటం... పిల్లల్ని కనటం... చావటమేనా? చనిపోయాక ఈ ప్రపంచం ఏమవుతుంది? ఈ సినిమాలు, సరదాలు, టీవీలూ, ఆశాసౌధాలూ... అన్నిటినీ వదిలి అసలెందుకు చావాలి? మృత్యువు లేకుండా వుంటే మనిషి ఎంత ప్రశాంతంగా సుఖంగా వుండగలడో కదా!

మేఘావృతమైన ఆకాశం క్రింద తూనీగల్లా ఆలోచనలు... మృత్యువే అన్నిట్లోనూ ప్రధాన అంశం. అవి పెరుగుతున్న కొద్దీ బ్రతుకు మీద అపారంగా పెరుగుతున్న ప్రేమ. అదే మృత్యు భయంగా రూపాంతరం చెంది నన్ను ప్రతిక్షణం వెంటాడుతోంది.

రోడ్డు మీదకు వెళ్ళాలంటే భయం... ఏ బస్సో లారీనో కొట్టేస్తే?! ఇంటి కప్పుకేసి చూడాలంటే భయం... దాన్ని అన్నీ తగు పాళ్ళలో కలిపి సరిగా కట్టారో లేదో? ఏ క్షణాన అది కూలిపోయి ఆ శిథిలాల్లో సమాధి అవుతానో?! ఒంటరిగా వుండాలంటే భయం... పొంచి వున్న మృత్యువు




ఏ క్షణాన నా మీద విరుచుకుపడుతుందో?! చావు మేళం వింటే ఆ శవయాత్రలాగే నేనూ...! ఏది వింటున్నా మృత్యు భేరిలాగా, ఏది కంటున్నా మరణ దృశ్యం వైపే!

కాలేజీ మానేశాను. తమ్ముడు కాలేజీకీ, నాన్న ఆఫీసుకీ వెళ్ళాక ఇంట్లో ఒంటరిగా నేను... ఆలోచనల చితిలో కాలుతూ! ఒంటరి తనం ఆలోచనల్ని రెట్టింపు చేస్తుంటే... ఆ ఆలోచనలు భయాన్ని మరింత పెంచుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఓసారి అంకుల్ వచ్చారు. ఏదో 'అలజడి'గా కనిపించారు... పెరిగిన గడ్డం, మాసిన బట్టలు, అలసటగా! స్నానం చేసి, నాన్న పంచె కట్టుకుని బట్టలు లాండ్రీకి పంపి నిద్రపోయారు. సాయంత్రానికిగానీ లేవలేదు. తమ్ముడితో బజారుకెళ్ళి ఏవేవో తినుబండారాలు పట్టుకొచ్చారు. రాత్రి భోంచేసి సిగరెట్ కాలుస్తూ నాన్నతో పిచ్చాపాటీ మాట్లాడుతున్న అంకుల్‌కి నా భయాలన్నీ చెప్పాను... నాన్న శ్రోతగానే మిగిలారు.

"నిజమే! భూమి మీద మనిషి పుట్టిన నాటి నుండీ ఇప్పటి వరకూ పుట్టిన వాళ్ళంతా బ్రతికి వుంటే భూమి ఎలా వుండేదో తెలుసా?" అంకుల్ అడిగారు.

"ఎలా వుండేది?" చందమామ కథ వింటున్న చిన్ని పాపాయిలా అన్నాను.

"తేనె తుట్టెలా, బ్రహ్మోత్సవాలప్పుడు తిరుపతి కొండలా, కరువుకాలంలో రేషన్ షాపు ముందు క్యూలా... నేలకంటికి కనిపించనంతగా..."

ఆ ఉపమానాలకు ఫక్కున నవ్వాను.

"నిజం రా! జననమరణాలు ప్రకృతి ధర్మాలు. 'ఎందుకు?' అని ప్రశ్నించడానికి వీల్లేనివి! పుట్టటం ఎలా అయితే మన అంగీకారం లేకుండా జరిగిందో మరణమూ అంతే! పుట్టుకని అనియంత్రితంగా స్వీకరించిన మనం చావు కెందుకు భయపడాలి? మనం నిద్రలో వున్నపుడు ఈ ప్రపంచం ఆగిపోయిందా! అంతే! మృత్యువు తరువాత కూడా దాని గమనం ఆగదు. ఆగకూడదు. అసలు మృత్యు భయం మృత్యువు కన్నా భయంకరమైనది. దానికి లోబడటం మనం తెలిసి చేస్తున్న పొరపాటు..."

"మీరు సిగరెట్లు త్రాగటంలా!"

"యువార్ రైట్! ఒప్పుకుంటాను. మృత్యు భయం నుండి బయట పడటం నువ్వు నేర్చుకోవాలి. గాంధీ, లింకన్, భగత్‌సింగ్, ఇందిరా గాంధీ... లాంటి వాళ్ళంతా చనిపోయినా చిరంజీవులు కాదూ?? ప్రతి ప్రాణికీ మరణం అనివార్యం. తన తరువాత తరాలు క్షేమంగా, సుఖంగా కొనసాగేలా చూడటమే ప్రతి మనిషి పుట్టుకకీ పరమార్థం!"

"వేదాంతం మాట్లాడుతున్నారే."

"దాని పేరేమైనా ఇది సత్యం. ఇదే ప్రకృతి ధర్మం. అంతెందుకు? నీ విషయమే తీసుకుందాం. నీలో మృత్యుభయం ప్రవేశించి మూడేళ్ళు కావస్తోంది కదూ! నీ కేమీ కాలేదని నీకు తెలుస్తూనే వుంది కదా! అంటే ఆ భయం వల్ల నువ్వు మూడేళ్ళ సంతోషాన్నీ, ప్రశాంతతనీ, ఇతర రంగాల్లో సాధించగల ఎంతో అభివృద్ధినీ పోగొట్టుకున్నట్లేగా! దీప్తీ! కాలాన్ని వృథాగా గడపటం కాలాన్ని చంపెయ్యటమే. అది మన లాంటి అభివృద్ధి చెందవలసిన దేశంలో తీవ్రమైన సామాజిక నేరం!"

"అంటే... నాన్న, మీరు, నా స్నేహితురాళ్ళు, నా అభిమాన సినీ తారలూ అందరూ చనిపోవాల్సిందేనా?" అనిపించింది కానీ... 'తప్పదు' అని గడచిన కాలం తన అనుభవాలతో భవిష్యత్తుని సూచిస్తోంది.

నా వయస్సుకి మరో రెండేళ్ళు కలిశాయి. ఈ రెండేళ్ళలో అంకుల్ సూచన, ప్రోత్సాహాలతో బి.ఎ. పూర్తిచేశాను. కథలు, నవలలతో ప్రారంభించి ఎన్నో వైజ్ఞానిక, తత్త్వశాస్త్ర గ్రంథాలు... చదువుతూ...! నా జీవితం మరొకరితో ముడి పడింది. అర్థం చేసుకుని సహకరించే భర్త నాదంటూ ఓ కుటుంబం, నేనే నెరవేర్చాల్సిన బాధ్యతలు, జీవితాన్ని ఓ కొత్త మలుపు తిప్పిన అనుబంధాలూ, ఆనందాలూ, అనుభూ

తులూ...!

అంకుల్‌తో ఉత్తరాల అనుబంధం తగ్గింది. బహుశా నేనే నిర్లక్ష్యం చేశానేమో!

అంకుల్‌కి ఓ సుదీర్ఘ లేఖ వ్రాశాను. జవాబు రాలేదు. పుట్టినరోజు, పెళ్ళి రోజులకు మాత్రం 'అంకుల్ శైలి'లో గ్రీటింగ్స్ వస్తూనే వున్నాయి. వాటిలోనైనా అంకుల్ అడ్రసు ఇవ్వలేదు. ఇంతకు ముందులా పత్రికల్లో రచనలూ కన్పించటం లేదు.

అంకుల్ గురించి నాలో మొదలైన ఆత్రుత ... మరుగున పడిపోయిన 'భయాన్ని' మళ్ళీ బయటపడేసింది. త్వరలో రాబోతున్న నా 'మేరేజ్ డే' గ్రీటింగ్స్ వస్తే... ఎలాగైనా అడ్రసు తెలుసుకుని... ఒక్కసారి రమ్మని వ్రాయాలి!... అని నిశ్చయించుకున్నాక మనసు కుదుటపడింది.

కాలం యాంత్రికంగా గడుస్తోంది. రేపు 'మేరేజ్ డే' అనగా... నేను కళ్ళు తిరిగి పడిపోయాను. శ్రీవారు కంగారుగా ఆసుపత్రికి తీసుకెళ్ళారు. నాన్న, నానీ (వాడిప్పుడు ఇంజనీరు), అత్తగారు కబురందుకుని వచ్చారు.

డాక్టరు చెప్పిన మాట విని అందరి ముఖాలూ ఆనందంతో వెలిగిపోతున్నాయి. ఆ శుభవార్త విన్నంతనే నాకు మాత్రం ఒళ్ళంతా చెమటలు కమ్మాయి. అలవికాని భయం నన్ను ఆవరించింది.

అవును వీళ్ళకేం! ఆనందపడిపోతారు!

'ఇచ్చే ప్రతిజన్మ తల్లికి మరో జన్మ'ని ఎవరో అన్న మాటలు గుర్తొచ్చాయి. 'మాతృత్వంలోనే వుంది ఆడజన్మ సార్థకం!' ఎక్కడో వినిపిస్తున్న సినిమా పాట నాకు ఉపశాంతి నివ్వలేదు.

ఏదో అసహనం... చిరాకు... భయానికి తోడయ్యాయి.

మనవడి కోసం ఎదురుచూడటమే తన కర్తవ్యంగా పెట్టుకున్న అత్తగారు నన్ను మరీ అపురూపం చెయ్యసాగారు.

''మాతృత్వం ఓ మధురానుభూతి'' అని ఎన్నో నవలల్లో చదివాను. కానీ నాకది మృత్యు భయాన్ని మాత్రమే తలపింపజేస్తోంది. ఆ రాత్రి నాకు కంటి మీద కునుకు లేదు.

భారంగా తెల్లవారింది. పెళ్ళిరోజు ప్రత్యేక కార్యక్రమాలన్నీ అత్తగారి అతి జాగ్రత్తల వల్ల రద్దయ్యాయి. గంట ఒక యుగంగా గడిచి పన్నెండైంది. ''పోస్ట్!'' వినిపించగానే పరుగున వెళ్ళి ఉత్తరం అందుకున్నాను.

కవరు తెరిచాను.

## చిట్కాలు

వారానికోసారి వేపాకులు నూరి, నిమ్మరసం పుల్లటిపెరుగుకు కలిపి బాగా తలకు రుద్ది, శీకాయ లేదా కుంకుడుకాయతో స్నానం చేస్తే చుండ్రు పూర్తిగా తగ్గుతుంది. వెంట్రుకలు రాలిపోవడం ఆగిపోతుంది.

– ఉష

మాసిన తెల్ల కాగితం.

''దీప్తీ!

పెళ్ళిరోజు శుభాకాంక్షలు. తప్పక వస్తాను త్వరలో.

ఆశీస్సులతో — అంకుల్''

అడ్రసు ఇప్పుడు కూడా లేదు!

*   *   *

''మీరంతా నాకు తెలియకుండా ఏదో దాస్తున్నారు. చెప్పండి. అదెంత భయంకరమైన వార్తయినా ఇప్పటికి నేను విన్న వాటిని, చూసిన వాటిని మించిందై వుంటుందా? అయినా ఫరవా లేదు. చెప్పండి. నేను తట్టుకోగలను!'' ప్రాధేయ పడుతున్నాను...

ఆయన మారు మాట్లాడలేదు.

నా సహనం కోల్పోయేటట్లున్నాను.

మౌనంగా ఆ రోజు దిన పత్రిక అందించారు నాన్న.

''ఎన్‌కౌంటర్‌లో ముగ్గురి దుర్మరణం'' మొదటి పేజీలో వార్త. మధ్యలో రంగుల్లో ఫోటో ఇన్‌సెట్. ఆ ఫోటోలో ...

''నో! ఇది అబద్ధం!'' నా అంతరంగం భూమి బద్దలయ్యేలా ప్రతిధ్వనిస్తోంది.

అప్పుడే... వార్డ్ బాయిస్ రెండు క్రేడిల్స్ తెచ్చి నా బెడ్ ప్రక్కన వుంచి వెళ్ళారు. ఆ వెనుకే ఇద్దరు నర్సులు ఇద్దరు శిశువుల్ని తెచ్చి వాటిలో పడుకోబెట్టారు.

''కంగ్రాట్స్ దీప్తీ! కవలపిల్లలు. సాధారణంగా ట్విన్స్ ఇద్దరూ ఆడ లేక ఇద్దరూ మగ శిశువులు పుడతారు. ఒక ఆడ శిశువు, ఒక మగ శిశువు ట్విన్స్‌గా జన్మించటం రేర్‌గా జరుగుతూ వుంటుంది. బై ది బై నీ బర్త్‌డే కూడా ఈ రోజేనట కదా! ఇట్ ఆల్సో లుక్స్ స్ట్రేంజ్! హేపీ బర్త్‌డే టూ యూ త్రీ!'' అన్నది డాక్టర్.

వింటుంటే నాకే ఆశ్చర్యంగా వుంది!

''అంకుల్ బర్త్‌డే కూడా ఈ రోజే నాన్నా!''

నాన్న తన కంటి నీరు నా కళ్ళబడకుండా దాచాలని ప్రయత్నిస్తున్నారు.

''ఏమండీ! నాన్నా! అత్తయ్య! అంకుల్ త్వరలో వస్తానన్నారు కదూ!''

అందరూ హఠాత్తుగా స్థాణువయ్యారు... నాకు మతిభ్రమించిందేమో నన్న భయంతో.

''నాన్నా! ఇదుగో అంకుల్. ఇదిగో అమ్మ. ఇద్దరూ ... నా బిడ్డలుగా పుట్టారు. మనతో కలిసి వుండిపోవాలని మళ్ళీ వచ్చేశారు నాన్నా!''

నాన్న కళ్ళలో తృప్తి మెరిసింది.

ఇప్పుడు నాకు మృత్యుభయం లేదు. బిడ్డలిద్దర్నీ కంటికి రెప్పల్లా పెంచే బాధ్యత నాకా ఆలోచనల తీరికే ఇవ్వటం లేదు.

అవును మరి...

ఒకరు జన్మనిచ్చిన తల్లిలా...

మరొకరు అమ్మలాంటి ప్రేమ పంచిన అంకుల్‌లా...

ఒళ్ళో... నా బిడ్డలుగా!

[ముక్కల్లో కూర్చున్న సోదరి కె. నిర్మలకు ప్రేమతో అంకితం]

